ప్రజాశక్తి

కృష్ణా ఎన్‌టిఆర్

బుధవారం 25 జనవరి 2023 8 పేజీలు





మరమ్మతులకు నోచని రోడ్లు

- సుదీర్ఘకాలంగా విడుదలకాని నిధులు
- రూ.73.70 కోట్లతో ప్రతిపాదనలు
- 15 వంతెనల పునర్నిర్మాణానికి రూ. 69 కోట్లు
- సిఎం జగన్ హామీలు మరో రూ.42.80 కోట్లు



ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో రోడ్లు కనీసం మరమ్మతులకు నోచుకోవడంలేదు. రహదారులు, భవనాలుశాఖ (అర్‌అండ్‌బి) పరిధిలోని రహదారులపై అడుగుకో గొయ్యి దర్శనమిస్తోంది. పలు వంతెనలు శిధిలావస్థకు చేరాయి. తాజాగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రోడ్ల అంశంపై సమీక్ష నిర్వహిస్తూ అప్‌గ్రేటెడ్ టెక్నాలజీతో రహదారుల మరమ్మతులు చేపడతామని ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ ప్రకటనతో రహదారుల మరమ్మతులు ఇప్పటికైనా ఓ కొలిక్కి వస్తాయా లేక మాటలకే పరిమితం అవుతాయా అన్న చర్చ జరుగుతోంది.

కృష్ణాజిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఆర్‌అండ్‌బి శాఖ పరిధిలో స్టేట్ హైవేలు 384 కిలో మీటర్ల 121 మీటర్లు, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు 1115 కిలోమీటర్ల 193 మీటర్లు కలిపి మొత్తం 1499 కిలోమీటర్ల 314 మీటర్లు మేర రహదారులు ఉన్నాయి. వీటికి సంబంధించిన మరమ్మతులకు పలు ప్రతిపాదనలు, ముఖ్యమంత్రి హామీలు పెండింగ్‌లో ఉన్నాయి. గత ఏడాది అక్టోబర్లో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అవనిగడ్డలో పర్యటించిన సందర్భంగా అస్తవ్యస్తంగా తయారైన అవనిగడ్డ- కోడూరు రోడ్డు నిర్మాణానికి రూ.35 కోట్లు మంజూరు చేశారు. గత ఏడాది ఆగస్టులో పెడన నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంలోనూ ఆ (మిగతా 6లో)

రహదారుల మరమ్మతులు ప్రతిపాదనలు

నియోజకవర్గం	ప్రతిపాదనల విలువ (కోట్లలో)
మచిలీపట్నం	05.50
పెడన	10.60
గుడివాడ	12.50
పామర్రు	18.60
గన్నవరం	06.50
అవనిగడ్డ	10.50
పెనమలూరు	09.50
మొత్తం విలువ	73.70

25-01-2022

శ్రద్ధాంజలి

జీవితాంతం భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సభ్యులుగా, సానుభూతిపరులుగా జీవనం సాగించారు. కురుమద్దాలి గ్రామంలో భూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా పేదల తరపున నిలబడి అనేక మిలిటెంట్ పోరాటాల్లో పాల్గొన్నారు. అనేక బైండోవర్ కేసులు పెట్టినా ధైర్యంగా ఎదుర్కొని ఉద్యమానికి అండగా నిలిచారు. గ్రామ ఉపసర్పంచిగా 11సం॥లు ప్రజలకు ఉన్నతమైన సేవలు అందించారు వారికి మా అరుణాంజలి.



కీ॥ శే॥ రాజులపాటి హిమామ్

జననం: 9-01-1929 మరణం: 13-01-2023

అనురాగం, ఆప్యాయత, ప్రేమానురాగాలతో మంచితనానికి మారు పేరుగా నిలిచి మాఉన్నతికి తోడ్పడిన ఆదర్శమూర్తికి అశృనాయనాలతో శ్రద్ధాంజలి ఘటిస్తు... మీరు చూపిన బాటలో పయనిస్తామని తెలుపుతూ...

మీ కుటుంబ సభ్యులు

కుమారులు - కోడళ్ళు
రాజులపాటి పోతరాజు- రేవతి
రాజులపాటి నిర్మలేశ్వరరావు -సునీత

కుమార్తె - అల్లుడు
జన్ను నాగమల్లేశ్వరమ్మ - జన్ను నాంచారయ్య

మనవళ్ళు - మనవరాళ్ళు
రాజులపాటి చైతన్య- భవిత (భార్య)
శ్రీమతి ప్రత్యూష - ఫణివిజయ్ (భర్త)
రాజులపాటి సాహితి
జన్ను అశ్వినీకుమార్



కీ॥శే॥ కొలుసు పెదరెడ్డియ్య యాదవ్ గారు
మాజీ పార్లమెంటు సభ్యులు, మచిలీపట్నం
కారకంపాడు, మొవ్వ మండలం, కృష్ణాజిల్లా.
జననం : 06-04-1942 మరణం: 13-01-2023

స్వార్థము తెలియని సిద్ధుడివో... పరమార్థం తెలిసిన బుద్ధుడివో...

'ఆదర్శమూర్తి'కి అశ్రునివాళి

'నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతిపావక:
నచైనం క్లేదయ న్త్యాపోనశోషయతి మారుత:'
'మానవరూపంలో వెలిసిన మహనీయుడవయ్యా!
మా బాధలు తీర్చగ భువికి ఏతెంచిన దైవం నీవయ్యా!!
'మానవత్వం, మంచితనం, స్నేహభావం అణువణువునా
మూర్తీభవించిన మంచిమనిషి మీరు.
మీరు లేని లోటు మాకు ఎప్పటికీ తీరనిది... పూడ్చలేనిది...
మా కుటుంబ అభివృద్ధికి మీరు చేసిన కృషి అనన్య సామాన్యం...
మీరు పంచిన ఆప్యాయతానురాగాలు,
మధుర జ్ఞాపకాలు మేము ఎప్పటికీ మరువలేము'
'మీరు గడిపిన ఆదర్శవంతమైన జీవితం మాకు సదా అనుసరణీయం...'

భార్య : కొలుసు సామ్రాజ్యం

కుమారులు - కోడళ్ళు :
కొలుసు పార్థసారధి - కమల లక్ష్మి
పెనమలూరు శాసనసభ్యులు
కొలుసు వీర వెంకట సుబ్బారావు - మహెషి పెయిరిస్
కొలుసు కృష్ణకాంత్ - దీప్తి

మనుమళ్ళు :
కొలుసు నితిన్ కృష్ణ - అమృత భార్గవి
కొలుసు హనిషిత్, కొలుసు జెషిత్
కొలుసు ప్రజిత్
మనుమరాలు : కొలుసు మెత్నలి

పెదకర్మ : ది.25-1-2023 బుధవారం మొవ్వ మండలం, కారకంపాడులోని మా స్వగృహమునందు జరుపబడును. కావున తెలియజేయడమైనది.
సంస్మరణ సభ : ది. 25-1-2023 బుధవారం ఉదయం 10-00 గం॥లకు జరుగును.

జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు



సాథి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి-విజయవాడ: జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని పింగళివెంకయ్య సమావేశ మందిరంలో శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన బాలికల దినోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు వర్ధన్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి "సాథి" అన్‌లైన్ గూగుల్ మెయిల్‌ను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మట్లాడుతూ మార్పు ట్రస్ట్ ద్వారా కళాశాలలో ఉత్సహవంతులైన నలుగురు విద్యార్థులు ఒక ఉపాధ్యాయురాలుతో కోర్ కమిటీని నియమించి "సాథి" wdcwntrdtsaathi@gmail.com మెయిల్‌లో నమోదైన సమస్యలకు సంబంధించిన సమాచారం ముందుగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ దృష్టికి వస్తుందని, సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత విభాగాలకు తెలియజేసి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సాథి గూగుల్ మెయిల్ ద్వారా సమస్యలను తెలియచేసేవారి వివరాలను గోప్యంగా వుంచడం జరుగుతుందన్నారు. మహిళలు బాలికలు వారికి సంబంధించిన సమస్యలనే కాకుండా సమీపంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా సాథి దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించడంలో భాగస్వామ్యులు కావాలని కలెక్టర్ అన్నారు. **ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ:** బాలికలను సంరక్షించుకోలేని ఏ సమజం సమానత్వాన్ని , స్వయం సమృద్ధిని సాధించలేదని మహిళా కమిషన్ ఛైర్మన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఐఎంఎ హాలులో జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశు సంక్షేమానికి, మహిళల సర్వతోముఖాభివృద్ధికి అనేక పథకాలు అమలవుతున్నప్పటికి ఆశించిన ఫలితాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల రక్షణ కోసం దేశంలో అనేక చట్టాలు ఉన్నప్పటికి వారిపై అరాచకాలు తగ్గడం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో భ్రూణహత్యలు, శిశుమరణాలు గణనీయంగా తగ్గాయని మహిళా, శిశు సంక్షేమంలో ఆంధ్రప్రదేశ్ అగ్ర స్థానంలో ఉందన్నారు. డిఐజి ఆఫ్ పోలీస్ (కమ్యూనికేషన్స్) ఎన్.ఎస్.జె. లక్ష్మి మాట్లాడుతూ పలు పరిశోధనల్లో బాలుర కన్నా బాలికల్లోనే గ్రాహ్య శక్తి ఎక్కువగా ఉంటుందని, పలు అంశాల్లో నైపుణ్యం బాలికలకే ఎక్కువ ఉంటుందని తేలిందన్నారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ డాక్టర్ ఉమ మిక్కిలినేని, యూనిట్ హెడ్ గుణశేఖర్, రీజనల్ మేనేజర్ రావి శ్రీనివాసరావు, డాక్టర్ పి.వి.దుర్గారాణి, ప్రముఖ విద్యా వేత్త వెంకట్ పూలబాల, ప్రముఖ పెయింటర్ రాము అళహరి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మైలవరం:** బాలికల సంరక్షణ అందరి బాధ్యతని ఎల్బీఆర్ సీఈ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.అప్పారావు అన్నారు. స్థానిక ఎల్బీఆర్.సిఈ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ సహేలి ది గర్ల్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిసి ప్రొసీడింగ్ అధికారి పి.శోభారాణి, ఎస్.ఉమామహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చందర్లపాడు:** చందర్లపాడు జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో ఐసిడిఎస్ కార్యకర్తలు వ్యాసరచన, వకృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులను అందజేశారు. **ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు:** మండల కేంద్రంలో మానవహారం, ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ బాలికల పాఠశాల నుండి బాలికలచే ప్రతిజ్ఞ చేయించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఉషారాణి, నందిగామ ఐసిడిఎస్ సిడిపిఓ భాగ్యరేఖ, అంగన్వాడి కార్యకర్తలు నాగమణి, సువర్చల, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తిరువూరు:** ఎర్రమాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బాలికలను ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.హరికృష్ణ, విజయకుమార్, శ్రీనివాసరావు, కొండయ్య, జ్యోతి, దుర్గాభవాని పాల్గొన్నారు. **ప్రజాశక్తి-విజయవాడ:** పాఠశాల దశ నుంచి సామాజిక మాధ్యమాలు, వివిధ యాప్‌ల వినియోగం పై నియంత్రణ ఉండాలని ఎన్టీఆర్ జిల్లా దిశ పోలీస్ స్టేషన్ సిఐ వాసవి విద్యార్థినులకు సూచించారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా చైల్డ్ లైన్-1098 , ఫోరమ్ ఫర్ చైల్డ్ రైట్స్ ఆధ్వర్యంలో విజయవాడ కృష్ణలంకలోని వంగవీటి మోహనరంగారావు బాలికల ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విఎంఆర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గ్రేసమ్మ, దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ విజయ, బర్డ్స్ ఎన్జీఓ కార్యదర్శి కె.ప్రకాష్, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ నాగరాజు పాల్గొన్నారు.



నేడు దుర్గగుడికి పవన్‌కళ్యాణ్ రాక

ప్రజాశక్తి-వన్‌టౌన్: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ బుధవారం దుర్గగుడికి రానున్నారు. పార్టీ ఎన్నికల ప్రచార రథం వారాహి వాహనానికి బుధవారం ఉదయం 8 గంటలకు విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో పవన్‌కళ్యాణ్ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ముందుగా శ్రీ కనక దుర్గమ్మను దర్శించుకుంటారు.

నేత్రాలపై మరింత శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-వన్‌టౌన్: ప్రతి ఒక్కరూ నేత్రాలపై శ్రద్ధ చూపాలని అయాన్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ బషీర్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు అయాన్ హాస్పిటల్స్, ఎంజే నాయుడు హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నేత్ర, ఎముకుల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాసు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఎంజే నాయుడు హాస్పిటల్స్ ఎండీ రవితేజ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నిత్యం వ్యాయమానికి సమయాన్ని కేటాయించాలన్నారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు పర్యవేక్షించారు. డాక్టర్ ఏ బాలాజీ, డాక్టర్ మణికుమార్, డాక్టర్ సందీప్, ఎంజే నాయుడు చారిటబుల్ ట్రస్ట్ గౌరవాధ్యక్షులు వావిలాల రజనీకాంతశర్మ, సేవలందించారు.




ముఖ ఆధారిత హాజరులో ఇబ్బందులు తొలగించాలి : విద్యాసాగర్

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: ముఖ ఆధారిత హాజరులో ఉద్యోగులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆ ఇబ్బందులన్నీ తొలగించాలని జేఏసీ ఛైర్మన్ ఎ.విద్యాసాగర్ కోరారు. ముఖ ఆధారిత హాజరుపై విజయవాడ నగరంలోని వివిధ డిపార్ట్మెంట్ ఉద్యోగులుతో విజయవాడ నగర శాఖ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ ఆధారిత హాజరు వల్ల ఫీల్డ్ వర్క్ చేసే పరిస్థితి లేదని, ఫీల్డ్‌లో ఉన్న స్టాపు సిగ్నల్ ప్రాబ్లం వల్ల హాజరు నమోదు చేయలేకపోతున్నారని, అలాగే సెలవులకు సంబంధించిన ఆప్షన్స్ కూడా ముఖ ఆధారిత యాప్‌లో ఇంతవరకు పొందుపరచలేదని, ఏదైనా రోజున అత్యవసరంగా సెలవు పెట్టుకోవాలంటే ఆ సదుపాయం లేదని తెలిపారు. నాలుగో తరగతి ఉద్యోగులు ఆండ్రాయిడ్ ఫోన్ లేనివారు అనేక ఇబ్బందులు పడుతున్నారని హాజరు వేళలో సపరేట్ గా ఉన్న వాచ్మేన్ లాంటి ఉద్యోగులకు ఎటువంటి ఏర్పాటు కల్పించలేదని తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ డిఏలు, పెండింగ్ డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్య తీసుకోకుండా మీనవేషాలు లెక్కిస్తుందన్నారు. ఉద్యోగులకు సంబంధించి సంవత్సరం కాలంగా పెండింగ్లో బిల్లులన్నింటినీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడ నగర శాఖ అధ్యక్షుడు శ్రీ రామ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా సహాధ్యక్షుడు పి.రమేష్, కోశాధికారి సతీష్, ఉపాధ్యక్షులు రాజబాబు, విశ్వనాథ్, బీవీ రమణ పాల్గొన్నారు.

బుర్రకథ కళాకారులు చిన్నప్ప మృతి

ప్రజాశక్తి-నందిగామ: రిటైర్డు ఉపాధ్యాయులు, బుర్రకథ కళాకారులు దుగ్గిరాల చిన్నప్ప (88) మంగళవారం మృతిచెందారు. చిన్నప్పకు



ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అనాసాగరం, బెల్లంకొండవారిపాలెం, రామన్నపేట, కమ్మవారిపాలెం అర్‌సిఎం పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి వేలాది మంది విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపారు. ఏసుక్రీస్తు జీవిత చరిత్రను బుర్రకథ రూపంలో తెలుగు రాష్ట్రాలలో ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్రపతి నుంచి ప్రశంసాపత్రం, మాజీ గవర్నర్ సుశీల్ కుమార్ షిండే చేతుల మీదుగా అవార్డు చిన్నప్ప అందుకున్నారు. చిన్నప్ప స్వగ్రామం వీరులపాడు మండలం బోడవాడ-జమ్మవరం. చిన్నప్ప మతి పట్ల నందిగామ ఎంఎల్ఏ మొండితోక జగన్మోహనరావు, ఎంఎల్సి మొండితోక అరుణ్ కుమార్, అర్‌సిఎం పాధర్ మరియదాసు, విశ్రాంత ఉద్యోగ సంఘాల నాయకులు పిల్లి జయరాజు, ఎం.వై.దాసు, డి.ప్రకాష్ తదితరులు సంతాపం తెలిపారు.

'పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలి'

ప్రజాశక్తి-తిరువూరు: కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర అమలు చేయాలని ఎపి కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి సైదులు డిమాండ్ చేశారు. తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం కౌలు రైతుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పండిచిన పంటలకు కనీస మద్దతు ధర అమలు చేయాలని, మోడీ తీసుకొచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని తదిత ర రైతాంగ సమస్యలపై ఏప్రిల్ 15వ తేదీన వివిధ రైతుసంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలో ఆందోళన చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఇప్పటినుండే విస్తతంగా ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నామని తెలిపారు. మోడీ అధికారంలోకి వచ్చిన ఈ పదేళ్ల కాలంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, నల్ల చట్టాలను తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల వల్ల రైతులు మరింత సంక్షోభంలో పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి ఎం.ప్రభాకరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి సాంబారు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిలకే సబ్‌ప్లాన్ నిధులు వాడాలి : నటరాజ్

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వారి అభ్యున్నతికే వినియోగించాలని ఎన్టీఆర్ జిల్లా కెవిపిఎస్ కార్యదర్శి జి.నటరాజ్ పేర్కొన్నారు. ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వారి అభివృద్ధికే ఖర్చు చేయాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలోని డౌన్ సెంటర్ వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి అర్జీ ఇచ్చారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని పది సంవత్సరాల కాల పరిమితిని నిర్ణయిస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయం ప్రకారం నిధులను దారి మళ్లించకుండా పారదర్శకంగా ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కెవిపిఎస్ అధ్యక్ష కార్యదర్శులు గోపాల్‌రావు, స్టాలిన్, గౌరవ అధ్యక్షుడు దాదా నాగేశ్వరరావు, ప్రభుదాస్, శ్రీనివాసరావు ప్రజలు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి అర్జీ అందజేస్తున్న కెవిపిఎస్ నాయకులు



వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-వత్సవాయి: వాసవి క్లబ్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని వాసవి క్లబ్ ఛైర్మన్ మద్దు హరిబాబు, కార్యదర్శి కురుమాల జనార్దన్‌రావు తెలిపారు. మండల కేంద్రమైన వత్సవాయిలో 2023 సంవత్సరానికి వాసవి క్లబ్ నూతన కార్యవర్గాన్ని స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఎన్నుకున్నారు. వాసవి క్లబ్ ఛైర్మన్ మద్దు హరిబాబు, కార్యదర్శిగా కూర్మాల జనార్దన్‌రావు, ట్రెజరర్‌గా గార్లపాటి రవికిరణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వెంకట రాజారావు, కొత్త కష్ణారావు, జోన్ ఛైర్మన్ రాయపూడి శ్రీకాంత్, మద్దు కోటేశ్వరరావు, గుర్రం హనుమంతరావు, పల్లపోతుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-వత్సవాయి: బోనకల్లు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో 12 మండలాల క్రికెట్ పోటీలు ఈనెల 26 నుండి ప్రారంభం కానున్నాయని క్రికెట్ టోర్నమెంట్ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆంధ్ర తెలంగాణ అంతర్రాష్ట్ర సరిహద్దుకి సమీపంలో క్రికెట్ పోటీలను ఏర్పాటు చేయనున్నట్లు గేట్ టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు. ఎంట్రీ ఫీజు 500 రూపాయలు కట్టాలని, 25వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 9949928105కు సంప్రదించాలని పేర్కొన్నారు.

బ్యాంకు ఉద్యోగి ప్రసాద్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి-గంపలగూడెం స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విధులు నిర్వహిస్తున్న బెల్లంకొండ లక్ష్మీ హరిప్రసాద్ తల్లి రమాదేవి (62)



మంగళవారం మరణించారు.. గత కొన్ని రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని స్వస్థలమైన మైలవరం తరలించి కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-నందిగామ: రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని నందిగామ ఆర్టిఓ పద్మావతి అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం నందిగామ లో ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా వారోత్సవాలలో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే అనర్థాలను డ్రైవర్లకు వివరించారు. 2019 మోటార్ వాహన చట్టం గురించి అవగాహన కల్పించారు.డ్రైవర్లతో కలిసి హెల్మెట్ ర్యాలీ, మెడికల్ క్యాంపు,వాక్ దాన్ తదితర అంశాలపై ప్రజలను చైతన్యం చేయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టరు ఎంవిఎన్ రాజు,పరిపాలనా ప్రభాకర్ లింగం పాల్గొన్నారు.

లక్ష్మీపురం సర్పంచ్‌కు డిపిఒ షోకాజ్ నోటీసు

ప్రజాశక్తి-ఉయ్యూరు, చల్లపల్లి

చల్లపల్లి మండలం లక్ష్మీపురం గ్రామపంచాయతీలో రూ.38,72,847 నిధులు దుర్వినియోగంపై సర్పంచ్ కె.కోటేశ్వరరావుకు జిల్లా పంచాయతీ అధికారి ఎస్.వి.నాగేశ్వరనాయక్ షోకాజ్ నోటీసు జారీచేశారు. చెక్ పవర్ ఎందుకు రద్దు చేయకూడదో 10 రోజుల్లో సమాధానం ఇవ్వాల్సిందిగా చల్లపల్లి మండల పంచాయతీ విస్తరణాధికారి బి.అశోక్ ద్వారా షోకాజ్ నోటీసును గ్రామ సర్పంచ్‌కు ఆయన పంపించారు. సోమవారం 'స్పందన'లో ఫిర్యాదు స్వీకరించిన జిల్లా రెవిన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు ఆదేశించిన 24 గంటల్లో డిపిఒ ఈ విషయమై చర్యలు. ప్రారంభించారు. లక్ష్మీపురం గ్రామపంచాయతీ సాధారణ నిధులు రూ.6,64,247, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.32,08,600, మొత్తం రూ.38,72,847లు దుర్వినియోగమైనట్లుగా మచిలీపట్నం డివిజినల్ పంచాయతీ అధికారి తన నివేదికలో పేర్కొన్నారు. డిపిఒ తగిన క్రిమినల్ చర్యల కోసం జిల్లా ఎస్‌పి ద్వారా తగు చర్యలు తీసుకోవాలని డిఆర్ఒను సోమవారం జరిగిన 'స్పందన'లో ఫిర్యాదు చేశామని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

నాడు-నేడు పథకం ద్వారా రూ.కోటితో గుడ్లవల్లేరు మండలం కౌతవరం గ్రామంలోని కానూరి దామోదరయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ అభివృద్ధి చెందింది. రూ.35 లక్షలతో నాడు-నేడు పథకం ద్వారా అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయురాలు బిఎన్ఎల్ పద్మావతి తెలిపారు. నాడు-నేడు పథకం ద్వారా హైస్కూల్లో తరగతి గదుల ఫ్లోరింగ్, విద్యుదీకరణ, డైనింగ్ హాలు వంటి నిర్మాణాలు జరిగాయన్నారు. కార్పొరేట్ స్కూల్‌కి ధీటుగా తమ స్కూల్లో చదివిన ముగ్గురు విద్యార్థులకు ట్రిబుల్ ఐటీ సీట్లు సాధించారని తెలిపారు. స్కూల్ అభివృద్ధి, తమ పిల్లల ఉన్నత చదువులకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని)కి జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారికకు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వడ్లమూడి నాగమోహన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఈశ్వరరావు, అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

100 శాతం హాజరు తప్పని సరి : ఎంపిడిఒ

గుడివాడ : గుడివాడ రూరల్ మండలంలోని లింగవరంలోని ప్రభుత్వ పాఠశాలను ఎంపిపి గద్దె పుష్పరాణి, ఎంపీడీవో వెంకటరమణలు ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను పరిశీలించి విద్యార్థుల హాజరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో 100 శాతం హాజరు ఉండే విధంగా, విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతి గదులకు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం కోటిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాపారాయుడు, ఎర్రన్నాయుడుకు నివాళి

గుడివాడ : చరిత్ర కలిగిన బొబ్బిలి యుద్ధం ప్రారంభ తేదీని పురస్కరించుకొని మంగళవారం స్థానిక నీలామహల్ రోడ్డులోని తాండ్ర పాపారాయుడు, ఎర్రం నాయుడు విగ్రహాలకు వెలమ సంక్షేమ సంఘ పెద్దలు పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ గొర్జి సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగువారి పౌరుష ప్రతాపాలను దేశం నలుమూలలకు చాటిన గొప్ప యుద్ధం బొబ్బిలి యుద్ధమన్నారు. మాజీ కేంద్రమంత్రి కింజరపు యర్రంనాయుడు విగ్రహానికి సంఘ నాయకులు నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు గులిపల్లి ప్రభాకర్, బురాడ మధు, వర్రే శ్రీనివాసరావు, మూకల సత్యనారాయణ, చీకటి శేషు, మూడేడ్ల ఉమా, రెడ్డి షణ్ముఖ, అంబటి రంగారావు, గులిపల్లి పాండురంగరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు : మంత్రి

ప్రజాశక్తి-గూడూరు

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో కార్పొరేట్‌స్థాయిలో వైద్య సేవలు అందేలా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు.



బుక్‌లెట్లు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గూడూరు మండల పరిధిలోని ఐదుగుళ్లపల్లి గ్రామంలో పర్యటించారు. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యాధునిక, అత్యుత్తమ వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం తపిస్తోందన్నారు. ప్రస్తుతం 1,700లకు పైగా ఆస్పత్రుల్లో సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా పొరుగు రాష్ట్రాల్లోని 137 ప్రయివేటు, కార్పొరేట్ హాస్పిటల్స్, 17 సూపర్ స్పెషాలిటీ వైద్యశాలల్లో చికిత్సలు అందుతున్నాయన్నారు. ఇప్పటికే 2,446 చికిత్సలు ఆరోగ్యశ్రీ పథకంలో ఉండగా తాజాగా మరో 700 రకాల చికిత్సలను పథకంలో చేర్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. వైసిపి అధ్యక్షులు లుక్కా ఏలేసు, గూడూరు ఎంపీపీ సంగా మధుసూదన రావు, జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, వైస్ ఎంపీపీలు పిచ్చుక గంగాధరరావు, నేతల కుటుంబరావు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, గూడూరు రైతు భరోసా కేంద్రం చైర్మన్ పర్ణం మహాలక్ష్మి నాయుడు (పెదబాబు), మండల పార్టీ అధ్యక్షులు గోరిపర్తి రవి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మోటేపల్లి రత్నాకరరావు, ఐదుగుళ్లపల్లి సర్పంచ్ గోవాడ ప్రేమ్ కుమార్, మాజీ సర్పంచ్ మునిపల్లి బసవయ్య, ఆత్మూరి శ్రీనివాసు ప్రసాద్, గూడూరు సర్పంచ్ లింగం సులోచన రాణి, సీపీ సీనియర్ నాయకులు తలుపుల వెంకటకష్ణారావు, గూడూరు తహసిల్దార్ బి.విజయ ప్రసాద్, ఎంపీడీవో సుబ్బారావు, హౌసింగ్ డిఈ అడుసుమిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

26 నుంచి జిల్లాలో పాదయాత్ర : కాంగ్రెస్

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

భారత్ జోడో యాత్ర ముగింపు రోజు నుండి రాష్ట్రంలో 60 రోజుల పాటు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అధ్వర్యంలో 175 నియోజకవర్గాలలో పాదయాత్ర ప్రారంభిస్తున్నామని జిల్లా అధ్యక్షులు లాం తాంతియా కుమారి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న లాంతాంతియాకుమారి

తెలిపారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం భారత్ జోడో యాత్ర గోడపత్రిక, రాహుల్ గాంధీ సందేశం, యాత్ర కరపత్రికలను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాహుల్ గాంధీ భారత్ జూడో యాత్ర 3500 కిలోమీటర్లు ఈనెల 26తో కాశ్మీర్లో ముగుస్తుందన్నారు. దానికి అనుగుణంగా రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆధ్వర్యంలో పాదయాత్రను ఈ నెల 26 నుంచి మార్చి 26 వరకు 60 రోజులు పాటు రాష్ట్రంలో అన్ని175 నియోజకవర్గాలు, 25 పార్లమెంట్ నియోజకవర్గాలలో నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిపిసిసి సెక్రటరీ మొహమ్మద్ దాదా సాహెబ్, మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మొహమ్మద్ ఫిరోజ్ బేగ్, డిసిసి మైనారిటీ సెల్ చైర్మన్ షేక్ ఖాన్ భాష, మీడియా చైర్మన్ ఊటుకూరి శాంతిరాజు, పామర్రు నియోజక వర్గ ఇంచార్జ్ పెదపుడి దిలీప్ కుమార్, మచిలీపట్టణం సిటీ ప్రెసిడెంట్ కొడమంచిలి చంద్ర శేఖర్, పెడన ఇంచార్జ్ లింగాల సుధాకర్ రావు, గూడూరు మండల ప్రెసిడెంట్ రమేష్ బాబు, పెడన టౌన్ ప్రెసిడెంట్ డా.అప్పారావు, జిల్లా సేవదళ అధ్యక్షులు చిలుకోటి ప్రసాద్, జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులు రావి రమేష్, జిల్లా జనరల్ సెక్రటరీ, పిసిసి డెలిగేట్ నల్లబోలు కుమారి, డెలిగేట్ యూ జోసెఫ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-గన్నవరం(హనుమాన్ జంక్షన్)

34వ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం బాపులపాడు హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రోడ్డు భద్రతపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. బహుమతులు పొందిన విద్యార్థులకు హనుమాన్ జంక్షన్ ఎస్సై వి.వెంకటేశ్వరరావు, పి.సుందరరావు బహుమతులు ప్రధానం చేశారు. వ్యాస రచనలో ప్రథమ బహుమతి వి.కీర్తన, ద్వితీయ ఎస్.కె సైరాబాను, తృతీయ బహుమతి శ్రీచందన గెలుపొందారు. డ్రాయింగ్‌లో మొదటి బహుమతి పి.హనీఫ్, రెండో బహుమతి ఎస్.వినీల, మూడో బహుమతి ఎ.ఉమామహేశ్వరి గెలుపొందారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ బాపులపాడు హెడ్మాస్టర్ పి.వెంకట నాగేశ్వరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-బంటుమిల్లి

ఈ నెల 18 నుండి 24 వరకు రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 34వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ నిబంధనపై పాఠశాల, కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. బంటుమిల్లిలోని



కొమ్మారెడ్డి పాఠశాలకు చెందిన పామర్తి నిత్యానంద లోకేష్ (8వతరగతి), వెంట్రపాటి కీర్తన (10వ తరగతి) ద్వితీయ స్థానం సాధించారు. కృష్ణాజిల్లా పోలీస్ సూపరింటెండెంట్ జాషువా చేతుల మీదుగా వీరు బహుమతులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి, డిటిఒ సీతాపతి తదితరులు పాల్గొన్నారు గెలుపొందిన విద్యార్థులను కొమ్మారెడ్డి పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్, ఉపాధ్యాయులు అభినందించారు.

మెడికల్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-గన్నవరం

చిన్న ఆవుటపల్లిలోని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్, రీసెర్చ్ ఫౌండేషన్‌లో మంగళవారం మెదటి సంవత్సరం వైద్య విద్యార్థిని, విద్యార్థులకు వైట్ కోట్, ఫ్రెషర్స్ డే కార్యక్రమం జరిగింది. విద్యార్థులు



వేడుకల్లో పాల్గొన్న ఎంపి వల్లభనేని బాలశౌరి

కూచిపూడి నృత్యాలతో అతిథులకు స్వాగతం పలికారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ముఖ్యఅతిథిగా మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి హాజరై మాట్లాడారు. వైద్యవిద్యను అభ్యసించడం ఒక పెద్ద వరమన్నారు. ఎంతో కృషి, పట్టుదలతో వైద్య విద్య సీట్లను సాధించి ఈ వృత్తిను ఎంచుకోవడం అభినందనీయమన్నారు. అదే పట్టుదల, కృషితో కోర్సు పూర్తయిన తర్వాత రోగుల పట్ల సేవాదృక్పథంతో వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ ప్రెసిడెంట్, డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, అకాడమీ సెక్రటరీ పాలడుగు లక్ష్మణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మూర్తి, హాస్పటల్ మెడికల్ సూపరింటిండెంట్ డాక్టర్ అధితి కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.కళ్యాణి, డాక్టర్ మాదల ప్రదీప్, ఇతర విభాగాధిపతులు, డాక్టర్లు, వైద్య విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. అకాడమీ ట్రెజరర్ ఎన్.లలిత ప్రసాద్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య హాజరయ్యారు.

వెలివోలులో ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చల్లపల్లి

చల్లపల్లి మండలం వెలివోలులో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన బొల్లా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు గ్రామ టీడీపీ తమవంతుగా సాయంమందించింది. సోమవారం బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ పరామర్శించారు. గ్రామ టీడీపీ అందించిన ఆర్థిక సాయం బాధ్యత కుటుంబ సభ్యులకు రూ.15,600ల నగదును అందచేశారు. వ్యక్తిగతంగా మండలి బుద్ధప్రసాద్ మరో రూ.5 వేలను సాయంగా అందించారు. టీడీపీ కార్యకర్త మందపాకల కష్ణారావుకు కాలిపాదం తొలగించటంతో పరామర్శించి గ్రామపార్టీ సహాయం రూ.16,100 నగదును బుద్ధప్రసాద్ అందచేశారు. చల్లపల్లి మండల టీడీపీ మండల అధ్యక్షుడు మోర్ల రాంబాబు, సీనియర్ నాయకులు మోర్ల ప్రసాద్, వెలివోలు గ్రామ పార్టీనేతలు నాగేశ్వరరావు, మురాల అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న మండలి బుద్ధప్రసాద్

అజ్మీర్ దర్గాకు ప్రత్యేక చాదర్

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

వైసిపి అధ్వర్యంలో అజ్మీర్ దర్గాకు ప్రతి సంవత్సరం సంప్రదాయంగా పంపిస్తున్న ప్రత్యేక చాదరును మంగళవారం రైలులో ప్రయాణిస్తున్న ముస్లిం సోదరులకు అందజేశారు. హజరత్ ఖాజా గరీబున్ నవాజ్ ఉరుసు మహోత్సవానికి ప్రత్యేక రైలు సోమవారం మధ్యాహ్నం 1.40 గం.లకు మచిలీపట్నం ప్రధాన రైల్వే స్టేషన్ నుండి బయలు దేరింది. స్థానిక పలు దర్గాలలో ప్రత్యేక ప్రార్థనలు అనంతరం యువ నాయకులు పేర్ని కిట్టు ముస్లిం సోదరులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు సలార్ దాదా, మైనారిటీ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో చాదర్ పంపు కార్యక్రమంలో మాజీ మంత్రి, పోలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ముస్లిం సోదరులు అజ్మీర్ ఉరుసు యాత్రను దిగ్విజయంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ళ బల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాదు, ఇలియాస్ పాషా, రాళ్లకొట్టు రాము, ఖదీర్, ఖాజా, అరిఫ్, రబ్బాని, ఫిరోజ్, సలీం, భాజాని, మస్తాన్, భాషా, అస్లాం, అక్బర్, రఫీ, కరీముల్లా, ఫయుం, ఖలీల్ పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు చెల్లించాలని ధర్నా



ప్రజాశక్తి-ఎ.కొండూరు: వ్యవసాయ మార్కెటింగ్ యార్డు ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రెండున్నర సంవత్సరాలు గడిచిన నేటికీ డబ్బులు చెల్లించకపోవడంతో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రైతులు మంగళవారం స్థానిక తాహాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ పాత కొండూరు, అట్లప్రగడ గ్రామాలకు చెందిన 14 మంది రైతులు 2021లో మార్కెటింగ్ యార్డుకు ధాన్యం విక్రయించారని, ఇప్పటివరకు రైతులకు చెల్లించాల్సిన రూ.11 లక్షలు చెల్లించలేదని అన్నారు. రైతులందరూ ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన కౌలు రైతులని, అప్పులు ఎలా తీర్చాలో తెలియక చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. గతంలో వీరి వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేసిన తిరువూరు ఏఎంసి సూపర్వైజర్ కె.నాగ దుర్గారావు ఇటీవల కొంతకాలంగా రైతులు ఫోన్ చేసినా సమాధానం చెప్పడంలేదన్నారు. వచ్చే నెల 2వ తేదీ లోపు ఈ సమస్యను పరిష్కరించకపోతే తిరువూరు భద్రాచలం హైవేపై కుటుంబాల సమేతంగా రైతులను సమీకరించి రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు అనంతరం తాహాసిల్దార్ చాట్ల వెంకటేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. డబ్బులు చెల్లించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మార్కెటింగ్ సూపర్వైజర్ నాగదుర్గారావుపై ఏ కొండూరు ఎస్సైకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు ఎస్ రామకృష్ణారెడ్డి, కౌలురైతు సంఘం మండల కార్యదర్శి పి.ఆనందరావు, సిఐటియు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు బి.గోపిరాజు, డి.రాముడు, ఎం.కృష్ణప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల నిరసన



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద మంగళవారం ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ మరియు హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అంగన్వాడీలు నిరసన తెలిపారు. కనీస వేతనాలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా గ్రాడ్యూటీ ఇవ్వాలని, ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని, అంగన్వాడీ కేంద్రాలకు మౌలిక వసతులు కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కమిటీ సభ్యులు బొడ్డు రాము మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెను చార్జీలు పెంచాలని, 2007 నుంచి పెండింగ్ లో ఉన్న టిఏ బిల్లులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, సీనియార్టీ ప్రకారం వేతనాలు ఇచ్చి సూపర్వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలన్నారు. హెల్పర్స్ ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలు పెంచాలని, ప్రమోషన్ లలో రాజకీయ జోక్యం అరికట్టాలని, 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్‌గా మార్చాలని కోరారు. అనంతరం ఐసిడిఎస్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చిల్లకల్లు ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు టి మధుకుమారి, అంజమ్మ, ఉమా, ప్రసన్న, ప్రమీలరాణి, ఆర్ మేరీ, నాగచంద్రిక తదితరులు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ చట్టం పొడిగింపు హర్షణీయం

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను రాష్ట్ర ప్రభుత్వం మరో పదేళ్ల పాటు పొడిగించడం పట్ల దళిత చైతన్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లాది ప్రసాదరావు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను శాశ్వత చట్టంగా రూపొందించేందుకు దళిత, గిరిజనుల పట్ల చిత్తశుద్ధితో ప్రభుత్వం ప్రతిపక్షాలు తీర్మానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చాట్ల రాబర్ట్, పల్లెపాము అంతోని, వీరమళ్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి : ఆర్‌టిఒ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: 34వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో చివరి రోజు సందర్భంగా మంగళవారం జగ్గయ్యపేట మోటర్ వెహికల్ ఆఫీస్ వద్ద జరిగిన సమావేశంలో నందిగామ ఆర్‌టిఓ పద్మావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్‌ని వాహనదారులు పాటించాలని కోరారు.



వాహనాలు నడిపే ముందు వాహనాలకు సంబంధిత పత్రాలు ఫోర్సులో ఉంచుకోవాలని, వాహనం నడిపే వారికి ఖచ్చితంగా లైసెన్స్ ను కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట యంవిఐ యం రవికుమార్, సీనియర్ అసిస్టెంట్ మహ్మద్ ఆలాం, కానిస్టేబుల్ యన్ వెంకటేశ్వరావు, సిహెచ్ శరత్ చంద్ర, హోంగార్డు వై సువర్ణరావు పాల్గొన్నారు.

రైల్వే లైన్ సర్వే పనుల అడ్డగింత

ప్రజాశక్తి-మైలవరం: రైల్వే లైన్ సర్వే పనులను రైతులు మరో మారు అడ్డుకున్నారు. వస్తు, సరుకు రవాణా నిమిత్తం విజయవాడ నుండి మధ్యప్రదేశ్ వరకు నూతనంగా ఏర్పాటు చేస్తున్న రైల్వే లైనువలన రెండు పంటల పండే భూములను కోల్పోవాల్సి వస్తుందని, వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని చంద్రగూడెం గ్రామం వద్ద అధికారులు సాయిల్ టెస్టింగ్ కోసం రెవెన్యూ పోలీస్ అధికారులతో కలిసి యంత్రాలను సిద్ధం చేసుకుని మట్టి నమూనాలను సేకరిస్తున్నారు. సమాచారం అందుకున్న మైలవరం, చంద్రుగూడెం, పుల్లూరు గ్రామాల రైతులు అక్కడకు చేరుకొని అడ్డుకున్నారు. తరతరాల నుండి తమ కుటుంబాలు ఈ భూములను నమ్ముకున్నాయని, వీటిపైనే ఆధారపడి జీవిస్తున్నామని, తమ భూములను రైల్వే లైన్ కోసం ఇవ్వబోమని తేల్చి చెప్పారు. తమ అభీష్టానికి వ్యతిరేకంగా సర్వే పనులు నిర్వహిస్తే ఆత్మహత్యలు చేసుకోవడం తప్ప మరో మార్గం లేదన్నారు. దీంతో అధికారులు అక్కడ నుండి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో రైతులు గోగులముడి సాంబశివారెడ్డి, కడియం వెంకటప్పయ్య, శీలం సుబ్బారావు, ఐదవ వెంకయ్య, బుల్లయ్య, జగన్నాధం బాబు, ఎస్.ప్రతాపరెడ్డి, వి.కుమార్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, గోవిందు, భద్రం, నరసింహారావు, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లంక భూముల పరిశీలన

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల మండలంలోని గని ఆత్కూరు పరిధిలో కృష్ణానదిలో లంక భూములను మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ అజయ్ కుమార్ నుపూర్ పరిశీలించారు. లంక భూమి లీజు విషయమై మండలంలోని కొత్తపేటకు చెందిన రెండు సొసైటీ సభ్యులు పోటీ పడ్డారు. అయితే ఈ లంక భూమి కేటగిరీ 2 కింద నిర్ణయించి లీజుకు ఇచ్చేందుకు ప్రభుత్వం జీవో జారీ చేసింది. అందులో భాగంగా మంగళవారం జేసీ లంక భూములు ఎంత మేరకు సాగు చేసేందుకు లీజుకు ఇవ్వవచ్చో క్షేత్ర పరిశీలన చేశారు. రికార్డులు పరిశీలించారు. ఏ మేరకు లంక భూములు లీజుకు ఇవ్వవచ్చో సర్వే చేసి నివేదిక పంపాలని తహశీల్దార్ వి రాజకుమారి ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో రవీంద్ర రావు, సర్వే అధికారులు, ఆర్ ఐ శిరీష పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం జూపూడి త్రిలోచనపురం మూలపాడు మరియు కోటికలపూడి గ్రామాలలో గల లంక భూములను క్షేత్రస్థాయిలో మంగళవారం జెసి శ్రీనివాస్ నుపూర్ అజయ్‌కుమార్, సబ్‌కలెక్టర్ విజయవాడ అదితిసింగ్ పరిశీలించారు. మండలంలో సి తరగతిలో ఉన్న లంక భూములను ఏ బి గా మార్చుటకు పంపిన ప్రతిపాదనలు పరిశీలించడానికి వచ్చినట్లు తెలిపారు.

సిఎం జగన్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి-వన్‌టౌన్: తన కుమార్తె నందిని వివాహానికి రావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్‌కుమార్ కోరారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభానుతో కలిసి మంగళవారం సీఎం నివాసానికి వెళ్లిన ఆకుల శ్రీనివాస్ వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 28న విజయవాడ గుంటుపల్లిలోని సిఎ కన్వెన్షన్ హాల్లో తన కుమార్తె వివాహం జరగనుందని, తప్పక హాజరుకావాలని సిఎం జగన్‌ను కోరారు.

యువత భాగస్వామ్యం కావాలి : కర్లపాటి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: యువత వ్యక్తిగత లక్ష్యాలతో పాటు సామాజిక లక్ష్యాలను కూడా కలిగి ఉండాలని కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాస్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో యువత యువజన సంఘాలుగా ఏర్పాటై ప్రభుత్వ, ప్రభుత్వేతర అభివద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం వహించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆసక్తి కలిగిన యువత తమ ట్రస్టుని సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 91540 22922 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని జిఆర్‌సి విద్యాసంస్థలలో ఒకటైన జెఆర్‌సి కళాశాలలో మంగళవారం 'మాదక ద్రవ్యాల వినియోగం నిషేధించి యువతను కాపాడుకుందాం' అనే అంశంపై జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి శ్రీనివాసరావు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జెఆర్‌సి కాలేజి ప్రిన్సిపల్స్ రమేష్, అబ్బులు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: వచ్చే నెల 5వ తేదీ నుండి 9వ తేదీ వరకు జరిగే శ్రీ తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల మహోత్సవాల ఏర్పాట్లను మంగళవారం ఆలయ కార్యనిర్వనాధికారి లీలా కుమార్, చైర్మన్ చెన్నకేశవరావులు పరిశీలించారు. శ్రీ తిరుపతమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవం జరుగు ప్రదేశాన్ని, ఆలయ వద్ద పొంగళ్ల ఏర్పాట్లపై అధికారులకు సూచనలు సలహాలు అందించారు. అనంతరం మునేటి అవతల, అమ్మవారి ఆడిటోరియం వద్ద దీక్షా స్వాములకు ఏర్పాటు చేయు అన్నదానం ఏర్పాట్లను కూడా పరిశీలన చేశారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యములు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లను చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈ రాజు, ఏఈఓ ఉమాపతి ధర్మకర్తలు అధికారులు పాల్గొన్నారు.





నేడు శ్రీశైలంలో నగరాల వసతి సత్రం పనులు ప్రారంభం

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీశైలంలో నగరాల నిత్యాన్నదాన వసతి సత్రం నిర్మాణ పనులు 25న బుధవారం ఉదయం 9.45 గంటలకు ప్రారంభించనున్నట్లు కమిటీ ప్రధాన కార్యదర్శి కెయస్ జగన్, అధ్యక్షులు నల్లాన సూర్యారావు, కార్యవర్గ సభ్యులు లింగిపల్లి రామకృష్ణ తెలిపారు. మంగళవారం విజయవాడలోని కార్యాలయంలో ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశైలంలో 50 సెంట్ల స్థలంలో సత్రం నిర్మాణం జరుగుతోందని, వచ్చే జూలై నాటికి దీనిని పూర్తి చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు.



రేపు ఆర్య వైశ్య వివాహ పరిచయ వేదిక

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఈ నెల 26న కేబీఎన్ కళాశాలలో ఆర్య వైశ్య ఉచిత పరిచయ వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వాసవి విజయవాడ గౌరవ అధ్యక్షులు తూనుగుంట్ల శ్రీనివాస్, అధ్యక్షులు తెలప్రోలు వీరయ్య గుప్త, కార్యదర్శి చిట్ట అమర్ సుధీర్, కోశాధికారి లక్ష్మీ నారాయణ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ 62వ ఉచిత వివాహ పరిచయ వేదికను గురువారం ఉదయం 10 గంటలకు కేబీఎన్ కళాశాలలో, 17వ ఆర్య వైశ్య పునర్వివాహ పరిచయ వేదికను మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కన్వీనర్ జల్లూరి నాగ శ్రీనివాసరావు, పరిచయ వేదిక కన్వీనర్ యు.వి.పుల్లారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-భవానీపురం: డాక్టర్ కెఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 11 కెవి లోటస్ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 నుండి 10 గంటల వరకు లోటస్ అపార్ట్‌మెంట్, హెడ్ వాటర్ వర్క్స్, తాజ్ మసీదు, ఆళ్ల సింహాద్రి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విజయవాడ టౌన్ కార్యనిర్వహక ఇంజనీర్ బివి సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కో ఆర్డినేటర్ల నియామకం

ప్రజాశక్తి-విజయవాడరూరల్: వైసిపి ప్రజలకు మరింత చేరువ చేయాలని, జగనన్న సంక్షేమాభివద్ధి పాలన ఫలాలపై విస్తతంగా ప్రచారం చేయాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కష్ణ ప్రసాద్ కోరారు. ప్రజలందరికీ మంచి చేస్తున్న జగనన్న కోసం అంకిత భావంతో పని చేసి పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. మంగళవారం తన స్వగృహంలో నిర్వహించిన సమావేశంలో మండల కోఆర్డినేటర్లను నియమించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ పరిశీలకులు పడమట సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా)

జిల్లా కలెక్టర్ జనవరి 26న నిర్వహించనున్న 74వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. పూర్తి కలెక్టరేట్ స్పందన సమావేశపు మందిరంలో మంగళవారం ఆయన జిల్లా, వివిధ శాఖాధికారులతో మచిలీపట్నం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగే జిల్లాస్థాయి గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్సు సిద్ధం చేయడంతో పాటు పోలీస్ బ్యాండ్, జెండా ఆవిష్కరణ వేదిక, బందోబస్తుకు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ఏర్పాట్లు, ప్రభుత్వ పథకాలతో స్టాల్స్ ఏర్పాట్లకు సిద్ధం చేసుకోవాలన్నారు. విద్యుత్ కు అంతరాయం లేకుండా ముందస్తు ఏర్పాట్లను అందుబాటులో ఉంచుకోవాలని విద్యుత్ శాఖాధికారులకు సూచించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయడానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, డిఎస్పీ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన బాలికలకు బహుమతులు



జాతీయ బాలికా దినోత్సవంలో ప్రతిభ చూపిన బాలికలు జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సేవ్ గర్ల్ చైల్డ్ అంశంపై జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చూపిన వివిధ పాఠశాలల బాలికలకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా బహుమతి ప్రధానం చేశారు. ఆయా అంశాల్లో ప్రతిభ చూపిన వారికి ప్రథమ, ద్వితీయ, తతీయ విభాగాల్లో ప్రశంసా పత్రంతో పాటు వరుసగా రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు నగదు బహుమతి విద్యార్థినులకు అందించి కలెక్టర్ అభినందనలు తెలిపారు. స్వీయ రక్షణ, భ్రూణ హత్యలు, లింగ వివక్షత, లైంగిక వేధింపులు వంటి వాటిపై పాఠశాలల్లో బాలికలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించినట్లు డిఎంఅండ్ హెచ్ ఈ సందర్భంగా కలెక్టర్కు తెలిపారు. డిఎంఅండ్ హెచ్ డా.జి.గీతాబాయి, డా.డి. పద్మజ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించండి

రసాయన ఎరువులు, పురుగు మందులు లేని ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన తన చాంబర్ లో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజితసింగ్ తో కలసి జిల్లా వ్యవసాయ సలహా మండలి కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో పొలం బడి కార్యక్రమం ద్వారా రసాయన రహిత వ్యవసాయంతో చేపట్టే వ్యవసాయ పద్ధతులను రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జన్ను రాఘవరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి మనోహరరావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీధర్, ఎల్ ఎం సాయిరామ్, మత్స్య, పశుసంవర్ధక, ఉద్యానవనశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కెపి రెడ్డయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

కెపి రెడ్డయ్య సేవలు అజరామరం

ప్రజాశక్తి - మొవ్వ : కీర్తిశేషులు మాజీ ఎంపి కెపి రెడ్డయ్య సేవలు అజరామరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మొవ్వ మండలం కారకంపాడులో పెనమలూరు ఎంఎల్ఎ కొలుసు పార్ధసారథిని గన్నవరం ఎంఎల్ఎ వల్లభనేని వంశీమోహన్,కెడిసిసి బ్యాంక్ ఛైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మచిలీపట్నం బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు వేమూరి రామకృష్ణారావు, ఎఆర్కె మూర్తి, పివి ఫణికుమార్,పరుచూరి రామ్మోహనరావు, తదితర అధికార, అనధికార ప్రముఖులు పరామర్శించారు. కెపి రెడ్డయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రూ. 114 కోట్లు మంజూరు: బాలశౌరి

మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్టణం నగరపాలక సంస్థ, గుడివాడ మునిసిపాలిటీలకు కేంద్రప్రభుత్వ పథకం అమత్ 2.0 కింద రూ.114 కోట్లు మంజూరయ్యాయని బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ మురుగునీటి శుద్ధి కోసం రూ.39 కోట్లు, జగనన్న కాలనీలో మంచినీటి సౌకర్యం కోసం రూ.కోటి, మంచినీటి సౌకర్యం కోసం సుమారుగా రూ.3కోట్లు, మొత్తం రూ.43 కోట్ల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిందని తెలిపారు. గుడివాడ మునిసిపాలిటీకి మురుగునీటి శుద్ధికు రూ.39 కోట్లు, కాలనీలలో మంచినీటి సౌకర్యం కోసం రూ.22.31 కోట్లు, పట్టణంలో మంచినీటి సౌకర్యం, పార్కుల అభివద్ధి కోసం రూ.9.85 కోట్లు మొత్తం రూ.71.16 కోట్ల మంజూరుకు ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిందన్నారు. అందిన ప్రతిపాదనల మేరకు కేంద్ర ప్రభుత్వం రూ.114 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

జన సైనికుల పూజలు

మోపిదేవి : జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చేపట్టబోయే వారాహి యాత్ర విజయవంతం కావాలని కోరుతూ మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మెరకనపల్లిలో ఆధార్ కేంద్రం

మోపిదేవి : మోపిదేవి మండలం మెరకనపల్లి గ్రామ సచివాలయంలో ఆధార్ అప్డేట్ కార్యక్రమం చురుకుగా సాగుతోంది. ప్రభుత్వ ఆదేశాలతో మంగళవారం గ్రామ సచివాలయంలో విద్యార్థుల, గ్రామస్తుల ఆధార్ అప్డేట్ కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ యర్రంశెట్టి ధన రాజ్యలక్ష్మి,1 వ వార్డు నెంబర్ సొబిల రాఘవయ్య, పర్యవేక్షణలో గ్రామ సచివాలయ ఉద్యోగులు నాగ మల్లేశ్వరి, మోహనకష్ణ, నాగరాజు, మౌనిక, స్వాతి, అనూష ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఉయ్యూరు లయన్స్ క్లబ్‌కు అవార్డులు

ఉయ్యూరు : ఉయ్యూరు లయన్స్ క్లబ్‌కు పలు అంశాల్లో అవార్డులు లభించాయి. క్లబ్ ఆధ్వర్యంలో చేస్తున్న పలు సేవాకార్యక్రమాలకు సంబంధించి క్లబ్ కార్యవర్గానికి ప్రశంసలు, సత్కారాలు లభించాయి. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెగా సిటీ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రామ సత్యకిషోర్, కార్యదర్శి దండమూడి గణేశ్,ట్రెజరర్ పూర కిషోర్లను జోన్ చైర్ పర్సన్ బొమ్మదేవరాయ, జిల్లా గవర్నర్ శాంతి ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈసందర్భంగా పలువురు సభ్యులు అభినందనలు తెలిపారు.

ఎస్ఎఫ్ఐ మహాసభ గోడపత్రిక ఆవిష్కరణ

గుడివాడ : స్థానిక ఏఎన్ఆర్ కళాశాలలో మంగళవారం ఎస్ఎఫ్ఐ 49వ మహాసభల పోస్టర్లును జిల్లా కార్యదర్శి పి.పవన్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న కెటిఆర్ కళాశాలలో 49వ మహాసభ జరుగుతుందన్నారు. 28న పట్టణంలో ప్రదర్శన, అనంతరం కొత్త మున్సిపల్ కార్యాలయం సమీపంలో బహిరంగ జరుగుతుందని వివరించారు. జిల్లా ఉపాధ్యక్షులు సమరం, కమిటీ సభ్యులు కల్యాణ్, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి, బుసుక తవ్వకాలకు అనుమతివ్వాలని వినతి

ప్రజాశక్తి-అవనిగడ్డ

మండల పరిధిలోని దక్షిణ చిరువోలు లంక గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు మట్టి, బుసుక అవసరమైనందున తోలుకునేందుకు అనుమతించాల్సిందిగా తహశీల్దార్ ఎల్వీఎస్ రామకృష్ణ, సీఐ జి శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. మంగళవారం ఆ గ్రామ సర్పంచ్ సనక సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గ్రామస్తులు ఈ మేరకు వారిని కలిసి వినతి



తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో జగనన్న ఇళ్ల ప్లాట్లు లేఅవుట్-1, లేఅవుట్-2 లలో ఇల్లు లేని పేదలు ఇల్లు కట్టుకునేందుకు ఆ స్థలం పల్లంగా ఉన్నందున మెరకతోలించుకొని శక్తి లబ్ధిదారులకు లేకపోవడంతో సర్పంచ్ స్పందించి వారి సొంత భూమి నుండి మట్టి తోలుకొని ఎందుకు అనుమతులు ఇచ్చారన్నారు. దీనిని జనసేన నాయకులు అడ్డుకోవడంతో వారంతా తహశీల్దార్, సిఐని కలిసి తమ గోడు విన్నవించుకున్నారు. ఆ మట్టి పుష్కు వల్ల రహదారులు పటిష్టం చేసుకోవడంతో పాటు పంట పొలాలకు వెళ్లే దారులను బలపరుచుకోవడం జరుగుతుందని ఇళ్ల ప్లాట్లో మెరక అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

19న టీచర్స్ కోపరేటివ్ సొసైటీ ఎన్నికలు

ప్రజాశక్తి-అవనిగడ్డ

ఫిబ్రవరి 19న అవనిగడ్డ మండల పరిషత్ టీచర్స్ ఎంప్లాయిస్ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీకి ఎన్నికలు నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.లీల తెలిపారు. మంగళవారం అవనిగడ్డలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసినట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అథారిటీ ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. ఎన్నికలకు ఫిబ్రవరి 10వ తేదీన సంఘ కార్యాలయం వద్ద నామినేషన్లు స్వీకరించబడతాయని చెప్పారు. అర్హత కలిగిన ఓటర్ల జాబితాను సంఘ నోటీసు బోర్డులో ఈ నెల 27న ప్రకటించనున్నట్లు చెప్పారు. జాబితాలు 27 నుండి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు చూసుకోవాల్సిందిగా కోరారు. అభ్యంతరాలు ఏమైనా ఉంటే తెలియజేయాల్సిందిగా విజ్ఞప్తిచేశారు.

నేడు కురుమద్దాలి మాజీ ఉప సర్పంచ్ హిమామ్ సంస్మరణ సభ

పామర్రు : పామర్రు మండలం కురుమద్దాలి గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్, సిపిఎం అభిమాని రాజులపాటి హిమామ్ సంస్మరణ సభ బుధవారం ఉదయం 10 గంటలకు జరుగుతుంది. సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యాన కురుమద్దాలిలో జరిగే ఈసభలో సిపిఎం సీనియర్ నాయకులు పి.మధు, రాష్ట్ర కమిటీ సభ్యులు పిన్నమనేని మురళీకృష్ణ, స్థానిక నాయకులు పాల్గొంటారు. ఈనెల 13న గుండెపోటుతో మరణించిన ఆయన 1970 నుండి 1980 వరకు పదకొండేళ్లపాటు ఉప సర్పంచ్‌గా ఉన్నతమైన సేవలందించారు. గ్రామాభివృద్ధికి, పార్టీ విస్తరణకు ఎనలేని కృషి చేశారు. జీవిత చరమాంకం వరకు సిపిఎం సభ్యులుగా, అభిమానిగా ఉన్నారు. 1929 జనవరి 1వ తేదీన జన్మించిన హిమామ్ కురుమద్దాలిలో పేదల తరపున నిలబడి భూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేశారు. పోలీసులు బైండోవర్ కేసులు పెట్టినా ధైర్యంగా నిలబడి ఉద్యమాలకు అండగా నిలిచారు. పిఎసిఎస్‌లో ఎరువులను బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయించడాన్ని అడ్డుకుని రైతులకు సక్రమమైన ధరలకు దక్కేలా చేశారు. గ్రామస్తులతో సొసైటీని ఏర్పాటు చేసి



పుల్లేరులో చేపల పెంపకం ద్వారా ఆదాయం సమకూరేలా చేశారు. పంటల సాగులో అనేక మెళకులను పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించి అప్పట్లోనే మంచి పేరు సాధించారు. అపరాల్లో ఎక్కువ దిగుబడి సాధించేలా తోటి రైతులను ప్రోత్సహించేవారు. రైల్వే సమ్మె సమయంలో పాల్గొన్న పలువురు కార్మికులకు తన ఇంటిని షెల్టరుగా ఇచ్చారు. పార్టీ కార్యక్రమాలకు ఆయన ఇల్లే కార్యాలయంగా, కార్యకలాపాల కేంద్రంగా ఉండేది. అందరితోనూ ఆప్యాయంగా ఉండే ఆయన గ్రామంలో పెద్ద మనిషిగా ఉంటూ ఎవరికి ఏ సమస్య వచ్చినా అండగా ఉంటూ అందరి మన్ననలు పొందారు. వివాద రహితుడిగా ఉండే ఆయన గ్రామస్తులందరి తలలో నాలుకగా మెలిగి వారందరి ప్రేమాభిమానాలు పొందారు. గ్రామ ప్రముఖుడిగా వ్యవహరించిన ఆయన దళితులు, పేదలు, రైతుల తరపున అనేక పోరాటాల్లో పాల్గొని పలువురు ప్రశంసలు పొందారు. వార్డు సభ్యుడిగా అత్యధిక మెజారిటీతో గెలుపొంది ఆ తర్వాత ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. భార్య నాంచారమ్మ ఆయనకు చేదోడువాదోడుగా ఉంటూ పూర్తి సహకారం అందించేవారు. తమ పిల్లలను ప్రయోజకులుగాను తీర్చిదిద్దారు.

విమానాశ్రయాన్ని ప్రైవేటీకరిస్తే సహించం

సిఐటియు కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు

గన్నవరం : రాష్ట్రంలోనే అతి పెద్ద రన్ వే కలిగిన విజయవాడ(గన్నవరం) ఎయిర్పోర్ట్‌ను జాతీయ మానిటైజేషన్ (నగదీకరణ) పైప్‌లైన్ పేరుతో ప్రైవేటీకరణ చేయాలనే బిజెపి కేంద్ర ప్రభుత్వ వైఖరిని సిఐటియు కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. ఎయిర్ పోర్ట్ ప్రైవేటీకరణ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవడంతో పాటు యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 2022-2023 బడ్జెట్ సందర్భంగా విజయవాడ ఎయిర్ పోర్ట్‌ను ప్రైవేటీకరణకు ప్రకటించనున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. ఎయిర్పోర్ట్ అథార్టీ ఆఫ్ ఇండియాకు చెందిన 137 మేజర్ విమానాశ్రయాల్లో 25 ఎయిర్‌పోర్టులలో నగదీకరణకు ఎంపిక చేసినట్లు 2021-2022 బడ్జెట్ సందర్భంగానే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రకటించిందని పేర్కొన్నారు. వీటిలో విజయవాడ, తిరుపతి విమానశ్రయాలు కూడా ఉన్నాయని తెలిపారు. 25 విమానశ్రయాలు నగదీకరణ ద్వారా రూ.20,782 కోట్లను సంపాదించాలని కేంద్ర ప్రభుత్వం పథక రచన చేసిందన్నారు. అందులో భాగంగానే విజయవాడ విమానాశ్రయాన్ని ప్రతిపాదించనుందని తెలిపారు. పర్మినెంట్ ఉద్యోగుల స్థానంలో కాంట్రాక్ట్ వారిని తీసుకొచ్చే ప్రమాదం లేకపోలేదని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా, పిహెచ్‌సి ఇలా రిజర్వేషన్లు కొనసాగుతున్నాయని, ప్రయివేటురంగంలో ఆ పద్ధతి అమలు కావడం లేదని గుర్తుచేశారు. కార్పొరేట్ పెత్తనం, గుత్తాధిపత్యం పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. విజయవాడ (గన్నవరం) ఎయిర్పోర్ట్ ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ ఇయు) ఉద్యోగుల సంఘం చేయబోతున్న ఆందోళనలకు సిఐటియు కృష్ణాజిల్లా కమిటీ సంపూర్ణమైన మద్దతును మాదల వెంకటేశ్వరరావు, సిఐటియు గన్నవరం మండల కార్యదర్శి కళ్లం వెంకటేశ్వరరావు, అధ్యక్షులు పిల్లి మహేష్ ప్రకటించారు.



లయన్స్ సేవలు అభినందనీయం : డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండే లయన్స్ క్లబ్ వారు అంధ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ముందుకు రావడం అభినందనీయమని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెగా సిటీ సహకారంతో రూ.2.5 లక్షలతో గుణదల విజయమేరీ ఇంటిగ్రేటెండ్ అంధ విద్యార్థుల పాఠశాలలో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి (ఆర్‌వో) పథకాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సభ్యులు ముందుకు వచ్చి పర్యావరణ పరిరక్షణకు చేపట్టే కార్యక్రమాల్లో భాగస్వామ్యులు కావాలని సూచించారు. ఇప్పటికే వారు ఇ-వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగస్వామ్యులై ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి కాలుష్యనివారణకు కృషి చేస్తున్నారన్నారు. లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ పుట్టగుంట సతీష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం కోరిన వెంటనే విద్యా వైద్య రంగాల అభివృద్ధికి, ప్రజలకు అవసరమైన సేవలందించేందుకు తాము ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు. తొలుత అంధ విద్యార్థినులు మానస, బిందులు బ్రెయిలీ లిపిలో నీటి ప్రాముఖ్యత విశిష్టతను చదివి వినిపించారు. అలేఖ్య సాంప్రదాయ నృత్యం, విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గీతాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెగా సిటీ ప్రతినిధులతోపాటు విజయ మేరీ అంధుల పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ అమల, స్థానిక తహశీల్దార్ సిహెచ్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంధ బాలికలతో కలెక్టర్ డిల్లీరావు కొద్ది సేపు ముచ్చటించి బాలికల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

నేతాజీకి జనహిత వేదిక నివాళి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : దేశ ప్రజల కోసం, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన ఘతన నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు దక్కుతుందని జన హిత వేదిక అధ్యక్షులు ఉప్పులేటి నేతాజీ అన్నారు. బ్రిటీష ప్రభుత్వ దురహంకారానికి ఎదురొడ్డి సాయుధ పోరాటం ద్వారా భారత దేశానికి విముక్తి కల్పించాలని ఆజాద్ హింద్ ఫౌజ్‌ను నిర్మించి ప్రణాలను తృణప్రాయంగా ధారపోసిన త్యాగజీవి నేతాజీ అని కొనియాడారు. నేతాజీ జయంతి సందర్భంగా జన హిత వేదిక నేతలు ఆయను స్మరించుకుని నివాళులర్పించారు. అలాగే నగరంలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమల పూర్ణమ్మ, సంస్థ కార్యదర్శి వేములపల్లి రవి కుమార్ పాల్గొని నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మరమ్మతులకు నోచని రోడ్లు

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గంలో రహదారుల నిర్మాణానికి రూ.7.80 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. హామీలిచ్చి మూడు నుంచి ఐదు నెలలు వ్యవధి అవుతోంది. అయినా ఇప్పటికీ ఆ రహదారుల నిర్మాణం ఆచరణకు నోచుకోలేదు. ముఖ్యమంత్రి పర్యటనకు ఏడాది ముందే జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అస్తవ్యస్తంగా తయారైన రహదారుల మరమ్మతులకు ఆర్‌అండ్‌బి శాఖ రూ.73.70 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లాయి. కానీ సుదీర్ఘకాలంగా నిధులు విడుదలకాకపోవడంతో రోడ్లు మరమ్మతులకు నోచుకోలేదు.

శిథిలావస్థకు చేరిన 1 5 వంతెనలకు రూ. 69 కోట్లు

ఎరువుల లారీ వెళుతున్న సమయంలో ఉమ్మడి కృష్ణాజిల్లాలోని కైకలూరు నియోజకవర్గం ముదినేపల్లి మండలంలో ఓ వంతెన కుప్పకూలింది. ఈనేపథ్యంలో జిల్లాలో రెండేళ్ల క్రితం శిథిలావస్థకు చేరిన వంతెనల పునర్నిర్మాణానికి జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపారు. రూ.7 కోట్లతో పామర్రు నియోజకవర్గంలో రెండు, రూ.29 కోట్లతో మచిలీపట్నంలో మూడు, రూ.12 కోట్లతో గుడివాడలో మూడు, రూ.16 కోట్లతో అవనిగడ్డలో ఐదు, రూ.5 కోట్లతో పెడనలో రెండు వంతెనలు నిర్మించాల్సి ఉంది. మొత్తం 15 వంతెనల పునర్నిర్మాణానికి రూ.69 కోట్లు అవసరం అవుతాయి.

రహదారి భద్రత పెంపునకు చర్యలు

మంత్రి విశ్వరూప్

ప్రజాశక్తి - విజయవాడ : రహదారి ప్రమాదాలు లేని దేశాలకు ప్రతినిధులను పంపి రోడ్డు భద్రతా ప్రమాణాలను అధ్యయనం చేసి అమలు చేస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపె విశ్వరూప్ అన్నారు. మంగళవారం సాయంత్రం విజయవాడలోని ది కష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ హాలులో 34వ జాతీయ రోడ్డుభద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ది కష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్, మోడల్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షులు తుమ్మల లక్ష్మణస్వామి అధ్యక్షత వహించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న మాట్లాడుతూ రవాణాశాఖలో రాబోయే రోజుల్లో నూరుశాతం వాహనాల ఆటోమేషన్ పూర్తయితే ప్రజలకు లబ్ధి



మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

చేకూరుతుందన్నారు. అడిషనల్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎస్.ఎ.వి. ప్రసాదరావు మాట్లాడుతూ రహదారులు ఎంతగానో అభివద్ధి చెందినప్పుడు ప్రమాదాలకు ఆస్కారం ఉండదని, కానీ మనదేశంలో పరిస్థితి భిన్నంగా ఉందని అన్నారు. జాతీయ రహదారుల ప్రాధికారసంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ నీరజ్ గుప్తా, జిల్లా లారీ ఓనర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి వీర వెంకయ్య, రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషను ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు

రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపులో కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : రోడ్డు భద్రతపై ప్రజలలో అవగాహన కల్పించి ప్రమాదాలను నివారించాలని, ద్విచక్ర వాహనదారులు నిబంధనలను తప్పక పాటించాల్సిందేనని,





అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు అన్నారు. 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా మంగళవారం రవాణా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ద్విచక్ర వాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ డిల్లీరావు, శాసనసభ్యులు మల్లాది విష్ణు వర్ధన్‌లు కలెక్టరేట్ నుండి ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో 50 శాతంకి పైగా ద్విచక్ర వాహనాలే కారణమన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడపడం ఇద్దరకు మించి ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేయడం ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించడం వలన ప్రమా దాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రమాదాల కారణంగా వాహన చోదకులతో పాటు వారి కుటుంబ సభ్యులు, తోటి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్‌రూల్స్ పై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించడం, మితిమీరిన వేగంతో వాహనాలను నడపడం ద్వారా జరిగే రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించడం పై విద్యార్థులను చైతన్యవంతులుగా చేసేలా చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. నిబంధనలు అతిక్రమించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అతిక్రమించిన కేసులు పునరావృతం అయితే లైసెన్స్‌లను రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డిల్లీరావు అన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ యం. పురేంద్ర, రవాణా శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ : ఆజాదీ కా అమత్ మహోత్సవం లో భాగంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ గురించి అవగాహన కార్యక్రమం మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన మీటింగ్ హాలులో విజయవాడ జాయింట్ కలెక్టర్ అధక్షతన నిర్వహించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో భారత ఆహార వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విభాగం ద్వారా భారతదేశంలో వస్తు ఉత్పత్తి వినియోగానికి సంబంధించి పాటించాలన్సిన ప్రమాణాలు విజయవాడ జాయింట్ డైరెక్టర్లు వి.సాయికుమార్, కె.రాజశేఖర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించినారు. బిఐయస్ సర్టిఫికేట్ ప్రాముఖ్యత, ఆవశ్యకత వివరిస్తూ దేశవ్యాప్తంగా వ్యవసాయ, పరిశ్రమలు వంటి వివిధ రంగాలలో తయారయ్యే వస్తు విభాగాలకు బిఐయస్ జారీచేసే నాణ్యతా ప్రమాణాల కోడ్స్ గురించి వివరించారు. బిఐయస్ సర్టిఫికేట్ మార్క్ గురించి విశదీకరించినారు. బంగారం వెండి నాణ్యతా ప్రమాణాలకే కేటాయించే హాల్మార్క్ గురించి వివరించారు. బిఐయస్ లైసెన్స్ లేకుండా వివిధ ఉత్పత్తులు తయారు చేయకూడదని, వివిధ వస్తువులపై ప్రమాణాలు పాటించని తయారీదారుల ఉత్పత్తులను సీజ్ చేయడం, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ముదిరాజ్ సమస్యలపై కార్యాచరణ

కేలండర్ ఆవిష్కరణలో కష్ణమోహన్

ప్రజాశక్తి - విజయవాడ : జనాభా ప్రాతిపదికన ముదిరాజ్‌లకు నిధులు, పథకాలు, పదవుల్లో వాటాను దక్కించుకునేందుకు భవిష్యత్ కార్యాచరణకు శ్రీకారం చుట్టనున్నట్లు ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చప్పిడి కష్ణమోహన్ ముదిరాజ్ వెల్లడించారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బండారు వెంకటరాజు ముదిరాజ్ అధ్యక్షతన ముదిరాజ్ కాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈసభలో కృష్ణమోహన్ మాట్లాడుతూ బిసి కార్పొరేషన్లకు పాలకవర్గాలను కొనసాగిస్తూ నిర్ణయించడం హాస్యాస్పదమన్నారు. బిసిలకు దీని వల్ల ఒక్క రూపాయి కూడా మేలు జరగలేదన్నారు. ఎంఎల్‌ఎ మల్లాది విష్ణు



మాట్లాడుతూ ముదిరాజ్‌ల సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకు వెళతాన్నారు. తొలుత కేలండర్‌ను ఎంఎల్‌ఎ విష్ణు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు యాదవ్, ముదిరాజ్ ఉద్యోగుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాస్ ముదిరాజ్, మానవ హక్కుల సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ మల్లాది ప్రసాద్ మాదిగ, ముదిరాజ్ సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు తేనె సులోచన పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : జెఇఇ మెయిన్స్ - 2023 పరీక్ష ప్రశాంతంగా ప్రారంభమైంది. పరీక్షకు సంబంధించి మ్మడి జిల్లాలో ఐదు కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఉదయం, మధ్యాహ్నం రెండు షెషన్లుగా జరిగిన పరీక్షల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం షెషన్ 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష జరిగింది. కానూరులోని ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. పరీక్షల సందర్భంగా పూర్తిస్థాయిలో బందోబస్తును ఏర్పాటుచేశారు. పరీక్ష మంగళవారం నుండి ప్రారంభమై ఈనెల 31వ తేదీ వరకు వివిధ షెషన్స్‌లో పరీక్షలు జరుగుతాయి. రాష్ట్రవ్యాప్తంగా 91వేల మంది దరఖాస్తుచేసుకోగా విజయవాడ రీజియన్‌లో 22వేల మంది విద్యార్థులు రాయనున్నారు. తొలిరోజు షెషన్‌కు 1550 మంది హాజరుకావాల్సి ఉంది. 98 శాతం మంది హాజరయ్యారు. పరీక్ష బుధవారం కూడా జరుగనుంది.

నేటితో ఇన్‌స్పైర్ ప్రాజెక్టులను అప్‌లోడ్ గడువు పూర్తి

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఇన్‌స్పైర్ మనక్‌కు ఎంపికైన ప్రాజెక్టులను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఈనెల 25వ తేదీలోగా ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా సైన్సు ఆఫీసరు ఎం.హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా నుండి మొత్తం 376 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, వాటి వివరాలను తక్షణమే అప్‌లోడ్ చేయాలని తెలిపారు. వీటిని అప్‌లోడ్ చేస్తే 38 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి, వాటి నుండి నాలుగు ప్రాజెక్టులు జాతీయస్థాయికి ఎంపికయ్యే అవకాశం ఉందని తెలిపారు. వివరాలకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలను గాని లేదా జిల్లా సైన్సు ఆఫీసర్‌ను గాని సంప్రదించాలని కోరారు.

28 నుండి ఖాదీ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ నుండి ఫిబ్రవరి 6వ తేదీ వరకు నగరంలోని పంటకాలువ రోడ్డు మేరీస్ స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియంలో ఎగ్జిబిషన్ జరుగుతుందని జిల్లా హాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ సహాయ సంచాలకులు ఎస్.రఘునంద ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఎగ్జిబిషన్‌లో మన రాష్ట్రంతోపాటు పశ్చిమబెంగాల్, తమిళనాడు, కర్నాటక, మధ్యప్రదేశ్, జార్ఖండ్, కేరళ, డిల్లీతోపాటు 10 రాష్ట్రాలకు చెందిన ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ ఉత్పత్తుల అమ్మకాలను నిర్వహించనున్నామన్నారు. 120కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 28 తేదీ సాయంత్రం 5 గంటలకు ప్రదర్శనను జిల్లాకు చెందిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు ప్రారంభిచనున్నారని సహాయ సంచాలకులు రఘునంద ఆ ప్రకటనలో తెలిపారు.

తెలుగు యువత నాయకులు వర్మ మృతి



ప్రజాశక్తి - వన్‌టౌన్ : తెలుగు యువత పశ్చిమ నియోకవర్గ ప్రధాన కార్యదర్శి పెనుమత్స వర్మ (41) మంగళవారం మరణించారు. ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. వర్మ మృతికి పలువురు టిడిపి నేతలు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-యంత్రాంగం

జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారంనాడు ప్రదర్శనలు, ర్యాలీలు జరిగాయి.



గన్నవరం మండలంలో


గుడ్లవల్లేరు మండలంలో


పెదపారుపూడి మండలంలో

గన్నవరం(ఉంగుటూరు) : మండల కేంద్రమైన ఉంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులతో ప్రదర్శనలో పాల్గొన్నారు. ఆడపిల్లలను రక్షిద్దాం, ఆడపిల్లల్ని చదివిద్దాం, బాల్య వివాహాలు నిషేదిద్దాం, ఆడపిల్లల అక్రమ రవాణాన్ని అరికడదాం, లింగ వివక్షతను రూపుమాపుదాం అంటూ నినాదాలు చేశారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, బాలికలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.గన్నవరం మండలంలోని దావాజీ గూడెం ఎంపీపీ స్కూల్‌లో వాసవ్య మహిళా మండలి, హెచ్‌సిఎల్ ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం నవ భారతి, జిల్లా పరిషత్ హై స్కూల్ తెలుగు టీచర్ సుభాషిని, దావాజీగూడెం మహిళా పోలీస్ అనిత, వాసవ్య మహిళా మండలి కౌన్సిలర్ విజయ పాల్గొన్నారు. అంగన్వాడీ టీచర్ ఖాదర్‌బి, ఆశా వర్కర్ పుణ్యవతి, స్వయం సహాయక గ్రూప్ సభ్యులు, వాసవ్య మహిళా మండలి సిబ్బంది కే.సునీత, హాసిని పాల్గొన్నారు. పిల్లలకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కేసరపల్లి సుందరయ్య నగర్ ప్రాథమిక పాఠశాలలో వాసవ్య మహిళా మండలి – హెచ్ సి ఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. వాసవ్య మహిళా మండలి హెచ్ సి ఎల్ ఫౌండేషన్ కేసరపల్లి ప్రతినిధి కేశవ, గన్నవరం మహిళా మిత్ర సభ్యురాలు సదాలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, వాసవ్య మహిళా మండలి కార్యకర్తలు పాల్గొన్నారు. **పెదపారుపూడి :** మండల కేంద్రమైన పెదపారుపూడిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శివ నాగమణి మాట్లాడారు. వెంట్రుప్రగడ జడ్పీ హైస్కూల్లో ఐసిడిఎస్ సూపర్వైజర్ అనిత మాట్లాడారు. ప్రధానోపాధ్యాయురాలు భవాని, సచివాలయ మహిళా పోలీస్ యు నాగలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు రజిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు :** ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పామర్రు, కౌతవరం అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో హై స్కూల్‌లో బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ వాణి మాట్లాడారు. అనంతరం వ్యాసరచన, ఆటల పోటీలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు పద్మావతి, అంగన్వాడీ కార్యకర్తలు కె.నాగమణి, రజని, శశి, చాముండేశ్వరి, మంగాయమ్మ, కుమారి పాల్గొన్నారు.

29న ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి-చల్లపల్లి

లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వి.ఆర్.కె నగర్ ఆధ్వర్యంలో విజయవాడ ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పల్లెం పెద్దేశ్వరరావు సహకారంతో ఈనెల 29న చల్లపల్లి విజయ హైస్కూలులో ఉచిత మెగా గుండె వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు క్లబ్ కార్యదర్శి నర్రా సాయిబాబు, ఆసుపత్రి సిఏఓ రవికుమార్ తెలిపారు. అవనిగడ్డ నియోజకవర్గ నిరుపేద కుటుంబాల వారి కోసం ఈ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో క్లబ్ ప్రతినిధులు ఎస్.జీ.ఏ బాషా, రాయపాటి రాధాకష్ణ, హాస్పిటల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-బంటుమిల్లి

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ (వాణిజ్యశాస్త్ర) శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సేవా కార్యక్రమం ‘



విద్యార్థులకు పండ్లు పంపిణీచేస్తున్న కళాశాల ప్రతినిధులు

నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్మోహనరావు సారధ్యంలో కామర్స్ శాఖ అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు వికలాంగుల పాఠశాలను సందర్శించి పండ్లు, బిస్కట్లు, వాటర్ బాటిళ్లు పంచిపెట్టారు. కళాశాల విభాగం భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాల కామర్స్ శాఖఖాధిపతి ఆర్.హిమాలనీదేవి, అధ్యాపకురాలు జ్యోత్స్నతోపాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుడు ఎం.రాజు మాట్లాడారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కోడూరు

కోడూరు మండలంలోని ఉల్లిపాలెం గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఖాతాదారులైన


ఆర్థిక సహాయం అందజేస్తున్న కటకం కుటుంబరావు

హరిపురం గ్రామానికి చెందిన పూషడపు వెంకట రమేష్, హంసలదీవి గ్రామానికి చెందిన కొప్పనాతి యలమందులు ఇటీవల మతి చెందారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.20 వేలు ఉల్లిపాలెం పిఎసిఎస్ చైర్‌పర్సన్ కటకం కుటుంబరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉల్లిపాలెం పిఎసిఎస్ సీఈవో మత్తి అర్జునరావు, సనకా రాము, కమ్మిలి కోటేశ్వరావు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.


వైసిపి నియోజకవర్గ కన్వీనర్ల నియామకం

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం వైసిపి కన్వీనర్లుగా మాజీ కౌన్సిలర్లు చిటిక నాగేశ్వరావు, శీలం బాబ్జి, కార్పొరేటర్ గూడవల్లి నాగరాజు, మాజీ సర్పంచ్ వాలిశెట్టి రవిశంకర్, శౌంటి ఫరీద్‌లను నియమిస్తున్నట్లు వైసిపి పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజవర్గ కన్వీనర్లుగా నియమితులైన ఐదుగురుని పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.



నూతనంగా నియమితులైన వైసిపి కన్వీనర్లు


అన్నదానం చేస్తున్న కలంకారీ అసోసియేషన్ ప్రతినిధులు

కలంకారీ వెల్ఫేర్ అసోసియేషన్ వితరణ

ప్రజాశక్తి-పెడన

శ్రీ బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 100 మంది విద్యార్థులకు 100 రోజుల ఉచిత మధ్యాహ్న భోజనాల కార్యక్రమం (పరీక్ష సమయం)వరకు అధ్యాపకుల ఆధ్వర్యంలో 55వ రోజు మంగళవారం విజయవంతమైందని కళాశాల లైబ్రరీ సైన్స్ అధ్యాపకులు పేరిశెట్టి నాగరవి తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో విజటబుల్ హ్యాండ్ బ్లాక్ కలంకారీ ప్రింట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పెడన కార్యదర్శి సజ్జా నాగేశ్వరరావు మాట్లాడుతూ కష్టపడి చదవాలనీ, ప్రశ్నించేతత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. కలంకారీ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున మధ్యాహ్న భోజన పథకానికి రూ.15 వేలు లైబ్రరీసైన్స్ అధ్యాపకులు పేరిశెట్టి నాగరవికి సజ్జా నాగేశ్వరరావు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ పిబి సాల్మన్‌రాజు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కలంకారీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ బండారు ఆనందప్రసాద్, బళ్ళ ప్రసాద్,కట్టా నిర్మలకుమార్,బూసం లోకనాథం, కళాశాల అధ్యాపకులు పేరిశెట్టి నాగరవి, నిరంజన్,రూపా నాగశ్రీ,రాజ్యలక్ష్మి,విజయ్,రవికుమార్,గంగాధర్, గిరి,రాజ్యలక్ష్మి,ఉదయ భాస్కర్, మధులత, కనకదుర్గ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తిని తగ్గించటానికి కృషి : రత్నగిరి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

నేటి సమాజంలో పెరుగుతున్న నేర ప్రవృత్తిని తగ్గించే ఉద్దేశంతో బాలికల పట్ల సమాజం దృష్టిని మార్చడానికి, ఆడపిల్లల భ్రూణ హత్యలు నియంత్రించడాని దేశవ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ కృషిచేస్తోందని రాష్ట్ర బాలల సంక్షేమం కార్యక్రమం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రత్నగిరి అన్నారు. మచిలీపట్నం లేడీ యంప్తుల్ ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో రాష్ట్రీయ బాలల ఆరోగ్య కమిటీ, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సభలో రత్నగిరి మాట్లాడారు. గర్భస్థ ఆడపిల్లలను హత్య చేయటం చట్టరీత్యా నేరమన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సోనియా, జిల్లా సైకాలజిస్ట్ కె.రత్నకుమారి లేడీ యాంప్తిల్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ విజయశ్రీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి లంకిశెట్టి హరనాథ్‌బాబు, అధ్యాపకులు కిరణ్మయి, సాజిదా, సుందరి,విద్యార్థినులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రత్నగిరి

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-గన్నవరం(ఉంగుటూరు)

ఉంగుటూరు మండలం కొయ్యగూరపాడులోని గ్రామంలో జగనన్న కాలనీలోని లబ్ధిదారులకు మౌలిక వసతులు కల్పించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అధికారులకు విజ్ఞప్తిచేశారు. ఆముదాలపల్లి, లంకపల్లి గ్రామాలకు సంబంధించి సుమారుగా 200 ఇళ్లు మంజూరయ్యాయి. నేటికీ గృహ నిర్మాణాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించలేదు. లబ్ధిదారుల్లో 30 మంది ఇళ్ల నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. మరికొన్ని వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. మెరక తోలటం, రోడ్లు, తాగునీరు, కరెంటు వంటి వసతులు లేవు. సుమారు అర కిలోమీటరు నుంచి నీటిని 30 గృహాల వారు తెచ్చుకోవాల్సివస్తోంది. మౌలిక వసతులు కల్పించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఉంగుటూరు మండల నాయకులు అజ్మీరు వెంకటేశ్వరరావు కోరారు. లేనిపక్షంలో తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.


ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అజ్మీరు వెంకటేశ్వరరావు

రమేష్ ఆస్పత్రి ఆధ్వర్యంలో

26 నుంచి 'ఇండో బ్రిటీష్'లో వైద్య సేవలు

- దేశంలోనే మొదటిసారిగా క్లౌడ్‌డాక్స్‌తో అనుసంధానం
- అంతర్జాతీయ స్థాయి మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: రమేష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో విజయవాడ శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలోని ఇండోబ్రిటీష్ హాస్పటల్‌లో గుండె జబ్బుల ప్రత్యేక వైద్య విభాగం ఈ నెల 26వ తేదీన ప్రారంభించనున్నట్లు డాక్టర్ రమేష్ హాస్పటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు తెలిపారు. ఆసుపత్రి కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలోనే ప్రప్రథమంగా ఇండో బ్రిటీష్ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో క్లౌడ్ డాక్స్ (టెలి ఐసియు)కు అనుసంధానం చేయడం ద్వారా 24 గంటలూ రోగులు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఉంటారన్నారు. ఇక్కడ 50 పడకలతో అంతర్జాతీయ స్థాయి మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్, అత్యాధునిక క్యాత్‌ల్యాబ్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గుండె వైద్య నిపుణులు డాక్టర్ పి.వి.ఎస్. శ్రీనివాస్‌ప్రసాద్ ఆధ్వర్యంలో కార్డియాలజిస్టు డాక్టర్ షహనాజ్, ఎలక్ట్రోఫిజియాలజిస్టు డాక్టర్ చంద్రమౌళి, చిన్న పిల్లల గుండె వైద్య నిపుణులు



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌బాబు

డాక్టర్ జ్యోతి ప్రకాష్, డాక్టర్ వాసుదేవ్, సీనియర్ గుండె శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ జయరాంపాయ్, డాక్టర్ శివ ప్రసాద్, డాక్టర్ భరత్ సిద్దార్థలతో కూడిన వైద్య బృందం ఉంటుందన్నారు. హార్ట్ ఎటాక్, స్టెంట్ యాంజియోప్లాస్టీ, బైపాస్ సర్జరీ, వాల్వ్ మార్పిడి సర్జరీ, ఫేస్‌మేకర్, రేడియో ఫ్రీక్వెన్సీ, అబ్లేషన్, హార్టు ఫెయిల్యూర్‌కు సీఆర్‌డి, చిన్న పిల్లల గుండె జబ్బులకు వైద్య బృందం వైద్య సేవలందిస్తుందని తెలిపారు. ఇన్సూరెన్స్ పేషెంట్లతో పాటు కార్పొరేట్ రంగ ఉద్యోగులకు, డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్, జర్నలిస్టు హెల్త్ స్కీమ్ లబ్ధిదారులకు నాణ్యమైన వైద్య సేవలను అందిస్తారని తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డు లేని పేదలకు ఆరోగ్యభాగ్యం స్కీంలో రాయితీతో కూడిన వైద్య సేవలను అందించనున్నట్లు తెలిపారు. రమేష్ హాస్పటల్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో విజయవంతంగా 19 వేల యాంజియోప్లాస్టీ బైపాస్ సర్జరీ చిన్నపిల్లల గుండె చికిత్సలు, ఫేస్‌మేకర్‌లు నిర్వహించామన్నారు. 26వ తేదీ ఉదయం 11 గంటలకు రమేష్ హాస్పటల్స్ చైర్మన్ ఎం.ఎస్.రామమోహనరావు చేతుల మీదుగా వైద్య విభాగాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రముఖ విద్యావేత్త డాక్టర్ ఎం.సి.దాస్, కార్డియాలజిస్టు డాక్టర్ షహనాజ్ పలువురు పాల్గొన్నారు.



లయోలాలో క్యాంపస్ ఎంపికలు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: నగరంలోని ఆంధ్రా లయోలా కళాశాల విద్యార్థులు డేటా మార్వల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 43 మంది విద్యార్థులు ఉద్యోగార్హత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఫాదర్ కిషోర్ తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం కళాశాలలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థుల అభినందన సభ జరిగింది. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ కిషోర్ మాట్లాడుతూ తమ కళాశాలలో బిఎ, బికాం, బియస్సీ చదువుతున్న విద్యార్థులకు ప్రముఖ హెల్త్ కేర్ రెవిన్యూ అనలిటిక్స్ కంపెనీ అయిన డేటా మార్వల్ క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించినట్లు తెలిపారు. ఈంసదర్భంగా ఎంపికైన తమ విద్యార్థులకు సంవత్సరానికి జీతం రూ.2.8 లక్షల నుంచి రూ.3.2 లక్షల వరకు ఇవ్వనున్నారని తెలిపారు. విద్యార్థులను కళాశాల క్యాంపస్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జి.సహాయ భాస్కరన్ అభినందించారు.

కెఎఫ్‌సిలో రుచికరమైన చిజ్జా

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: కెఎఫ్‌సి రెస్టారెంట్లలో క్రంచీ చిజ్జాను ప్రారంభించినట్లు కెఎఫ్‌సి మేనేజర్ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆహారప్రియులు ఎక్కువగా ఇష్టపడే చికెన్ విత్ చీజ్‌తో తయారుచేసిన చిజ్జాను ఎక్కువ మంది ఇష్టపడతారని అటువంటి వారికోసం కెఎఫ్‌సి రెస్టారెంట్లలో ప్రారంభించినట్లు తెలిపారు. ఆల్‌చికెన్, నో క్రస్ట్ చిజ్జా,క్రిస్పీ చికెన్‌తో కలిపి చిజ్జాలను విక్రయించనున్నట్లు తెలిపారు. రుచికరమైన పిజ్జా సాస్, కరిగిన చీజ్, ఉల్లిపాయలు, మిక్స్డ్ పెప్పర్‌తో కలిపి హెర్బ్ స్ప్రింక్‌తో అందిస్తున్నామని తెలిపారు. రూ.299కు అన్ని కెఎఫ్‌సి రెస్టారెంట్లలో లభ్యమవుతుందని తెలిపారు.

ప్లాటినమ్ బ్యాండ్స్ విక్రయాలు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: వాలంటైన్స్‌డే సందర్భంగా ప్లాటినమ్ లవ్ బ్యాండ్స్‌ను ప్రత్యేకంగా అన్ని జ్యూయలరీ స్టోర్లలో విక్రయాలు ప్రారంభించినట్లు ప్లాటినమ్ బ్యాండ్స్ షోరూమ్ అధినేత ఎస్.కె.కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వాలంటైన్స్‌డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియచేసేందుకు ఎక్కువ మంది ప్లాటినమ్ లవ్ బ్యాండ్స్ పట్ల ఆసక్తి చూపుతారని అన్నారు. అందుకే సరికొత్త మోడల్స్‌లో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. నగరంలోని అన్ని జ్యూయలరీ షోరూమ్‌లలోనూ విక్రయాలు ప్రారంభించినట్లు తెలిపారు.

జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు

సిద్ధార్థ విద్యార్థిని పూజిత ఎంపిక

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఈ నెల 9 నుండి 11వ తేదీ వరకు జరిగిన 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో నగరంలోని సిద్దార్థ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని ఎం.పూజిత ప్రతిభ కనపరచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ తెలిపారు. పూజిత తమ కళాశాలలో సీనియర్ ఇంటర్ సిఇసి చదువుతుందని తెలిపారు. అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో ప్రతిభ కనపరచడం వలన వచ్చే నెలలో జరుగనున్న అండర్ -19 జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు తమ విద్యార్థి ఎంపిక కావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.



ఎస్ఆర్ఆర్‌లో నూతన భవనాలకు భూమిపూజ



భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న విష్ణు

ప్రజాశక్తి-విజయవాడ: వైసిపి హయాంలో ప్రభుత్వ కళాశాలలు పున:వైభవం సంతరించుకుంటున్నాయని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. మాచవరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.2.32 కోట్ల వ్యయంతో నూతన భవన నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తి లేదని తెలిపారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే కళాశాలకు ప్రహరీ గోడను నిర్మించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బి.అనిల్ కుమార్, డీఈ రాయన్న, డైరక్టర్ మాధవీలత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి, కోఆర్డినేటర్ రాంబాబు, స్థానిక కార్పొరేటర్ వి.రాజేశ్వరి పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆ దిశగా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. మంగళవారం 32వ డివిజన్ 228వ వార్డు సచివాలయ పరిధిలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైసీపీ డివిజన్ ఇంఛార్జి గుండె సుందర్‌పాల్, అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. డొంక రోడ్డు, బుడమేర కట్ట రోడ్డు, పలగాని ప్రభాకర్ వీధి, రామాలయం వీధులలో విస్తతంగా పర్యటించారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, సీడీఓ జగదీశ్వరి, నాయకులు అంగిరేకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ: పారిశుధ్య నిర్వహణలో మెరుగుదల ఉండాలని, లేకపోతే చర్యలు తప్పవని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. మంగళవారం సర్కిల్-3 పరిధిలోని 3వ డివిజన్ లూర్దునగర్, రామచంద్ర నగర్ తదితర ప్రాంతాలలో కమిషనర్ పర్యటించారు. ఆయా ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలిస్తూ, మురుగునీటి పారుదల సక్రమముగా జరిగేలా చూడాలని మరియు డ్రెయిన్ల యందు వ్యర్థములు ఎగువకు వెళ్ళకుండా ఐరన్ గ్రిల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గుణదల కొండ పైకి ఎక్కి ప్రతి రోజు చెత్త సేకరణకు మరియు డ్రెయిన్స్‌ను శు భ్రపరచుటకు సిబ్బంది వస్తున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. గన్నవరం ఎయిర్ పోర్ట్ కారిడార్ పనులను ప్రస్తుతం రామవరప్పాడు రింగు నుండి ప్రసాదంపాడు వరకు జరుగుతున్న పనులను పరిశీలించి వాటి నాణ్యత ప్రమాణాలు పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.చంద్ర శేఖర్, హెల్త్ ఆఫీసర్ డా.శ్రీదేవి పాల్గొన్నారు.

యువత 'మత్తు' బారిన పడొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. నగరంలోని కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ యువత ముఖ్యంగా చిన్నారులు మత్తు పదార్థాల విష సంస్కృతికి బానిస అవుతున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. నగర పరిధిలోని మురికి వాడలలో మత్తుపదార్థాల వినియోగం జరుగుతున్నట్లు దీనిపై పోలీస్, రెవెన్యూ, విద్య, స్వచ్ఛంద సంస్థలు టీములుగా ఏర్పడి నిఘా ఉంచాలన్నారు. గ్రామ వార్డు సచివాలయాలలోని వాలంటీర్లు, ముఖ్యంగా మహిళా పోలీస్ సేవలను వినియోగించుకుని సమాచారాన్ని తెలుసుకుని నిఘా పెట్టాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు ముఖ్యంగా మెడికల్ ఇంజనీరింగ్ కళాశాలలు, వసతి గృహాల పరిధిలో మత్తుపదార్థాలు, అమ్మకాలు నిర్వహించకుండా పర్యవేక్షించాలన్నారు. పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో అడిషినల్ సిపి పి.వెంకటరత్నం, డిఇవో సివి రేణుక, డియంహెచ్‌వో డాక్టర్ యం సుహాసిని, సంఘీక సంక్షేమ అధికారి యంవి విజయభారతి, ఐసిడిఎస్ పిడి జి.ఉమాదేవి పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యంలో బాలికల దినోత్సవం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: జనవిజ్ఞాన వేదిక కొండపల్లి పట్టణకమిటీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాలికా మేలుకో చట్టాలు తెలుసుకో అంశంపై హెచ్ఎం సంతోష్‌కుమార్ అధ్యక్షతన సభ ఏర్పాటు చేశారు. ముందుగా బాలికలను పరిరక్షించే బాధ్యత అందరం తీసుకుందామంటూ అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎంపిపి పాలడుగు జ్యోత్స్న మాట్లాడుతూ సమాజంలో అసమానతలు తొలగించడానికి సామాజిక సమతుల్యాన్ని కాపాడేందుకు బాలికలను రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు మానసికంగా శారీరకంగా అనేక రూపాల్లో వేధింపులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి నుండి రక్షణ పొందేందుకు చట్టాలను ఉపయోగించుకోవాలన్నారు. జెవివి జిల్లా ఉపాధ్యక్షులు పికామేశ్వరరావు మాట్లాడుతూ మహిళలకు రక్షణగా ఉన్న ప్రత్యేక చట్టాలను వివరించారు. ఎదిగే ఆడపిల్ల ఏం తెలుసుకోవాలి అనే పుస్తకాన్ని ఆవిష్కరించి వంద మంది విద్యార్థినులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి జెవివి శాఖ అధ్యక్షులు ఎస్‌కె సర్దార్ సాహెబ్, ఉపాధ్యక్షులు ఎస్‌డి మస్తాన్‌వలీ, ఇబ్రహీంపట్నం పిహెచ్‌సి డాక్టర్ డి ఇందిరాదేవి, జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర గోడపత్రిక, కరపత్రాలను కొండపల్లి కార్యాలయంలో మంగళవారం ఎన్‌టిఆర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొర్రా కిరణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ జోడో యాత్ర ముగింపు సందర్భంగా ఈ నెల 26 నుండి మార్చి 26వరకు రాష్ట్రంలో చేయిచేయి కలుపుదాం రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం పేరుతో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలుకూరు గ్రామ సర్పంచ్ గొంది సురేష్, శీలం రామకృష్ణ, చెరుకూరి హరికృష్ణ, పిట్టల నాగేశ్వరరావు, అన్నవరపు దుర్గారావు, మశనం సుధాకర్, డిసిసి ప్రధాన కార్యదర్శి అక్కల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.